క్లుప్తంగా

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు పసపాం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని పసపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 4 నుండి 6వ తేదీ వరకు రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో జరగబోయే పోటీలో వీరు పాల్గొననున్నారు. పాఠశాలకు చెందిన వి.మణికంఠ(800 మీటర్ల పరుగు), డి.గీత (లాంగ్‌జంప్), ఎ.ధనలక్ష్మి(పెంటాలిథిన్ విభాగం)లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో వున్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం ఆర్.నాగేశ్వరరావు, పీఈటీ లీలాకృష్ణతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



క్రీడాదుస్తులు, క్రీడా పరికరాలతో విద్యార్థులు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రభాకర్ పాఠశాలకు చెందిన క్రీడాకారులకు క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు బాల్ బ్యాడ్మింటన్, బ్యాట్, బాల్స్ వితరణగా అందజేశారు. వితరణ చేసిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం కృష్ణకుమారి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సారిపల్లి గౌరీశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు టెలి మెడిసిన్ సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

విజయనగరం ఫోర్ట్: కిశోర బాలికల సమస్యలను పరిష్కరించేందుకు టెలి మెడిసిన్, టెలి కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఆర్.బి.ఎస్.కె. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.వి.బి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక యూత్ హాస్టల్లో నేచర్ సంస్థ ఆధ్వర్యంలో సీహెచ్‌ఓలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నేచర్ సంస్థ పీడీ ఎస్.వికాస్, సంస్థ ప్రతినిధులు సుభాష్, కృష్ణ, బంగారుబాబు, ప్రసాద్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


చేసిన సేవలతోనే గుర్తింపు



మహంతి వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: సుదీర్ఘకాలం పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆర్మ్‌డ్ రిజర్వు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహంతి వెంకటరమణకు జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరఫున ఏఆర్ ఎస్ఐ ఎం.వెంకటరమణకు ఎస్పీ, అదనపు ఎస్పీ జ్ఞాపికలను, చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్‌బీ సీఐలు, కోఆపరేటివ్ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని తదితరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పని చేస్తున్న పలువురు పారిశుద్ధ్య కార్మికులకు చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ కె.అప్పలరాజు మంగళవారం ఘనంగా సత్కరించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన కార్మికులకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీకి సిబ్బంది కొరత

- ఏడుగురి సిబ్బందికిగాను ఇద్దరితోనే నిర్వహణ
- జిల్లాలోనే అత్యధిక ఆదాయం వస్తున్న పూసపాటిరేగ మార్కెట్ కమిటీ
- రైతులకు సక్రమంగా అందని సేవలు



పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

పూసపాటిరేగ: పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి ఆదాయం ఫుల్‌గా వస్తున్నప్పటికీ సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏడాదికి ఇచ్చిన లక్ష్యం కంటే అదనంగా ఆదాయం వస్తున్నా.. సిబ్బంది కొరతతో రైతుల సేవలకు అంతరాయం కలుగుతోంది. కమిటీలో ఏడుగురు సిబ్బంది వుండాలి కాని కేవలం ఒక్క కార్యదర్శి, ఒక్క సూపర్‌వైజర్‌తో కాలం వెళ్లదీస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఆదాయం వస్తున్నా రైతులకు సేవలకు అందించడంలో విఫలం అవుతున్నారు. మార్కెట్ కమిటీకి సంబంధించిన కమిటీ చైర్మన్, డైరెక్టర్లు నియామకం కాకపోవడం వలనే రైతులకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 2022 – 23 సంవత్సరానికిగాను 1.20 కోట్లు లక్ష్యం కాగా 1.40 కోట్లు ఆదాయం, 2023 – 24 సంవత్సరానికిగాను 1.61 కోట్లు లక్ష్యం కాగా 1.62 కోట్లు ఆదాయం, 2024 – 25 సంవత్సరానికిగాను 1.67 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు 99 లక్షలు (6 నెలలు) ఆదాయం వచ్చింది. మార్కెట్ కమిటీ పాలనా వ్యవహారాలు చూడాల్సిన పోస్టులు గత కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. టైపిస్టు, అసిస్టెంటు మార్కెటింగ్ సూపర్‌వైజర్, జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా వున్నాయి. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించే సెక్యూరిటీ గార్డులతోనే కార్యాలయం నిర్వహిస్తున్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని పట్టించుకొనే నాథుడు లేరనే విమర్శలు వున్నాయి. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలకు చెందిన రైతులకు సేవలందించాల్సిన పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఉన్నత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ద్వారా రైతులకు సేవలు అందించాలని కోరుతున్నారు.

లక్ష్యానికి మించి సమకూరుతున్న ఆదాయం వివరాలు..

సంవత్సరం	లక్ష్యం (రూ.కోట్లలో..)	ఆదాయం (రూ.కోట్లలో..)
2022-23	1.20	1.40
2023-24	1.61	1.62
2024-25	1.67	99 లక్షలు

ఉన్నతాధికారులకు నివేదించాం..



పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సిబ్బంది ఖాళీలపై ఉన్నత అధికారులకు నివేదించాం. గత కొంత కాలంగా సిబ్బంది కొరత ఉంది. మార్కెట్ కమిటీలో ఏడుగురు సిబ్బంది వుండాలి. కానీ ఇద్దరితోనే కాలం గడుపుతున్నాం. కార్యదర్శి, సూపర్‌వైజర్ మాత్రమే వున్నారు. మిగతా సిబ్బందిని త్వరితంగా భర్తీ చేయడానికి ఉన్నతాధికారులతో మాట్లాడుతాం. – సతీష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, పూసపాటిరేగ.

3 నుంచి కామాక్షి నవరాత్రి మహోత్సవాలు



నవరాత్రి మహోత్సవ కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

విజయనగరం: జిల్లా కేంద్రంలోని బొండాడ వీధిలో వేంచేసియున్న శ్రీమహాగణపతి కామాక్షి సమేత ఏకాంబేశ్వరస్వామి దేవాలయంలో దసరా మహోత్సవాలు సందర్భంగా మంగళవారం పాలక మండలి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా పాలక మండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకూ నవరాత్రి ఉత్సవాలు ఆలయంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. నవరాత్రులలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నాగమల్లి లోకనాద గణపతి రావు, కాకినాడ శశిభూషణరావు, సుందరపు వరహాలాచారి, నాగమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి

- విజ్జి స్టేడియంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు



విజ్జీ స్టేడియంలో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అతిది గజపతిరాజు

విజయనగరం: స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం నగర శివారుల్లో గల విజ్జీ స్టేడియంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా క్రీడా ప్రాంగణాన్ని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, ప్రజారోగ్య సిబ్బంది, క్రీడాకారులతో కలిపి శుభ్రపరిచారు. ముందుగా హాకీ క్రీడాకారులకు హాకీ స్టిక్కులను అందజేశారు. ఆ తర్వాత క్రీడా మైదానం చుట్టుపక్కల ఉన్న చెట్ల పొదలు, మొక్కలను తొలగించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు నగరంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా క్రీడాకారులతో కలిపి విజ్జి స్టేడియంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. పరిశుభ్ర వాతావరణతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ గాదం మురళి తదితరులు పాల్గొన్నారు.

వయోశ్రేష్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి



ర్యాలీలో పాల్గొన్న వయోశ్రేష్టులు

విజయనగరం టౌన్: ప్రపంచ వయోశ్రేష్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జిల్లా వయోశ్రేష్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అసోసియేషన్ అధ్యక్షుడు కుప్పారావు మాట్లాడుతూ వయోశ్రేష్టులపై ఇళ్లల్లో జరుగుతున్న వేధింపులను అరికట్టాలని, వేధింపులకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, వయోశ్రేష్టుల కోసం ప్రభుత్వాలు ప్రకటించిన రాయితీలను శతశాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్‌సీఎస్ పంచముఖ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఉన్న జిల్లా వయోశ్రేష్టుల సంక్షేమ సంఘం కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్‌సీఎస్ థియేటర్ కూడలి, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, కన్యకపరమేశ్వరీ ఆలయం వద్దకు చేరుకుంది. ర్యాలీలో సంఘం కార్యదర్శి కట్టమూరు చంద్రశేఖర్, జగన్నాథరావు, గిడుతూరు పైడితల్లి, అల్లంకి బసవమూర్తి, త్రినాథ్ ప్రసాద్, మండవిల్లి వెంకటరాజులతో పాటూ వయోశ్రేయోభిలాషుల సంఘం ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు

- విజయనగర ఉత్సవాల వేదికలను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్: విజయనగరం సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ పేర్కొన్నారు. ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి సిరిమానోత్సవంతో ముడిపడిన పలు వేదికలను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం సిరిమాను తిరిగే ప్రధాన రహదారి, కోట, మెగా ఈవెంట్, నిర్వహించే అయోధ్య మైదానం, సర్కస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే మాన్సాస్ గ్రౌండ్, క్రీడా పోటీలు నిర్వహించే విజ్జీ స్టేడియంలను పరిశీలించారు. ఆయా వేదికల ఇన్చార్జిలతో మాట్లాడి, ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను తెలుసుకున్నారు. కార్యక్రమాలపై అధికారులు ఎమ్మెల్యేతో చర్చించారు. మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలకు, అమ్మవారి సిరిమానోత్సవానికి ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. విజ్జి స్టేడియంలో నిర్మాణం పూర్తయిన మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంను ఈ నెల 10లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత, డీఆర్‌ఓ ఎస్‌డి.అనిత, సీపీఓ పి.బాలాజీ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కాంతిమతి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, ఆర్‌డీఓ కీర్తి, పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, టీడీపీ నాయకులు ఐవిపి.రాజు, ఆయా వేదికల ఇన్చార్జ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

విజయనగరం ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మన సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, సాంస్కృతిని చాటిచెప్పేలా, విభిన్నంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఈ ఏడాది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇది మనందరి పండగనీ, దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అన్న సమారాధన

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సుమారు రెండువేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా మాస శివరాత్రికి స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులు, దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, రమేష్ ప్రకాష్, శోభారాణి, భీమ, రుజుతా రెడ్డి, సోమశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థిని



సౌజన్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమామోహిని

నెల్లిమర్ల: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నెల్లిమర్ల ఎంజేపీఏపీ బీసీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని సౌజన్య మణి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సౌజన్యమణిని రాష్ట్ర స్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. జిల్లా జట్టు తరఫున పోటీల్లో పాల్గొంటుంది. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ రమామోహిని, పీడీ సీహెచ్ కామేశ్వరి, అధ్యాపకులు అభినందించారు.

భవాని భక్తులకు ప్రత్యేక బస్ సర్వీసులు

విజయనగరం అర్బన్: జిల్లా పరిసర ప్రాంత భవాని దీక్ష భక్తులకు విజయదశమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్ సర్వీసులను ఏర్పాటు చేస్తున్న విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు సౌకర్యంతమైన సేవలను అందిస్తూ సరసమైన రవాణా చార్జీలకు ఈ సేవలో అందుబాటులో ఉంచామన్నారు. విజయనగరం డిపో నుండి విజయవాడకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. భవాని భక్తులకు వారు కోరుకున్న ప్రదేశం నుండి వారు కోరిన యాత్రా ప్రదేశాలకు బస్సు సర్వీస్‌లను నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99592 25620 (డిపో మేనేజరు), 9494331213 (అసిస్టెంట్ మేనేజరు), 73829 21380 (సూపరింటెండెంట్), 73829 23683(బుకింగ్ సూపర్‌వైజర్), 9440359596 (సిస్టం సూపర్‌వైజరు) నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



రోగులకు మందులు అందజేస్తున్న రాంబాబు

విజయనగరం ఫోర్ట్: ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ కన్వీనర్ కోసూరి రాంబాబు అన్నారు. స్థానిక కామాక్షమ్మ గుడి ఆవరణంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల జేఏసీ, తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం తిరుమల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అభిప్రీతి, డాక్టర్ వేదవతి 140 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. 70 మందికి ఉచితంగా ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు అందజేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



విజయనగరం: లబ్ధిదారులకు పింఛన్ మొత్తాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు



భోగాపురం: గుడివాడలో లబ్ధిదారురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న బంగారురాజు

విజయనగరం/విజయనగరం రూరల్: అర్హులైన వారికి శతశాతం పింఛన్లు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు అన్నారు. మండలంలోని పడాలపేట గ్రామంలో, నగరంలోని 5వ డివిజన్ దాసన్నపేటలోని నవాబుపేట, 45వ డివిజన్ కేఎల్ పురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ఒక్కసారిగా వెయ్యి రూపాయిలు పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. దివ్యాంగులకు పింఛన్ రెట్టింపు చేసిన ఘనత కూడా టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, కార్పొరేటర్ గాదం మురళి, సర్పంచ్ సుంకరి శ్రీదేవితో పాటు, పంచాయతీ విస్తరణాధికారి తిరుపతిరావు పాల్గొన్నారు. అంతకు ముందు కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ పింఛన్ల పంపిణీని పరిశీలించారు.

పింఛన్ అందజేత

భోగాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు అన్నారు. మండలంలోని గుడివాడ, రాజాపులోవ గ్రామాల్లో ఎన్టీఆర్ పింఛన్ భరోసా సొమ్మును లబ్ధిదారులకు నేరుగా అందించారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిల్ల జమున, దాసరి చంద్రశేఖర్, కర్రోతు రాజు, కొండపు ఈశ్వరరావు, జనసేన, టీడీపీ నాయకులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేని పక్షంలో సహించేది లేదని కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ పి.నల్లనయ్య మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత, ప్రజా అవసరాలను తీర్చే క్రమాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సాకేటి వీధిలో కమ్యూనిటీ హాల్‌ను, అలాగే వివిధ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి నిర్మాణ పనులను గమనించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావసరాలు తీర్చటంతో పాటు నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. పరిశీలనలో ఆయన వెంట ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమాజానికి వృద్ధులు పెద్దదిక్కు

విజయనగరం: వృద్ధులు కుటుంబంతో పాటు సమాజానికి పెద్దదిక్కు అని, ఎంతో అనుభవం కలవారని, వారిని చూసి యువతరమంతా ఎంతో మంచిని గ్రహించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి.ప్రసాదరావు ఆకాంక్షించారు. శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల భవనంలో వృద్ధులకు పండ్లు, బిస్కట్ ప్యాకెట్లను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కె.ఆర్.డి.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు కూడా వృద్ధుల శ్రేయస్సు కోసం, హక్కుల కోసం అనేక చట్టాలను రూపొందించిందని, వృద్ధులకు సేవ చేయడం దైవ సేవగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్.సి.హెచ్.అప్పలనాయుడు, క్లబ్ పెద్దలు త్యాడ ప్రసాద్ పట్నాయక్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరుపొట్ట దశలో వరి



డెంకాడ: సింగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న ఏఓ

డెంకాడ: వరి పంట చిరుపొట్ట దశలో ఉందని, దీనికి తగిన సస్యరక్షణ చర్యలు అవసరమని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని సింగవరం, డెంకాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో వరి పంట పొలాలను వ్యవసాయాధికారులు, రైతులు వెళ్లి పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో ఏఓ నిర్మల మాట్లాడుతూ చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటకు ఎకరాకు 20 కేజీల యూరియా, 25 కేజీల పొటాష్ వేయాలన్నారు. పురుగులు, తెగులు ముందుస్తు చర్యల్లో భాగంగా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీ-500 గ్రాములు, లేకపోతే ప్రొఫినోఫాస్ 50శాతం ఎస్‌సీ-500 ఎంఎల్, వాలిడామైసిన్ మందును 200 వందల లీటర్లలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ పతివాడ గౌరి, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ కుమారి, వ్యవసాయ సిబ్బంది కె.సంతోష్‌కుమార్, బి.రామకోటి, అపర్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భవించి 25 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో జిల్లాలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. టెలిఫోన్ భవన్ నుంచి సింహాచలం మేడ, కోట, మూడులాంతర్లు, గంటస్తంభం, అంబేద్కర్ జంక్షన్ నుంచి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు మాట్లాడుతూ దేశ ప్రజలకు నాణ్యమైన సర్వీసులను అందిస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ అని పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ ఫోర్‌జీ, ఫైవ్ బీ నెట్ సర్వీసులను త్వరలో ప్రారంభిస్తుందన్నారు. ప్రజలందరూ తమ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీఎంలు శ్రీధర్, శారద, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.